షాపుల వద్ద రేషన్.. గిరిజనులకు శాపం

- ఇంటింటికీ రేషన్ వ్యవస్థ, ఎండీయూ వాహనాల రద్దు
- జూన్ 1 నుంచి చౌక డిపోల వద్దే సరుకుల పంపిణీ
- ఏజెన్సీలో తెరుచుకోనున్న 84 రేషన్ షాపులు
- గిరిజనులకు తప్పని నడక యాతన


వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటికే రేషన్ ఇస్తున్న దృశ్యం (ఫైల్)


గతంలో కాలి నడకన బియ్యం మూటలు మోసుకెళుతున్న గిరిజనులు (ఫైల్)

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి ఇంటికీ నిత్యావసర సరుకులు సకాలంలో అందించాలనే లక్ష్యంతో ఎండీయూ వాహనాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. పోలవరం నియోజకవర్గంలో సుమారు 70 వాహనాల ద్వారా రేషన్ సరఫరా చేసి స్థానికంగా సేవలందించడం ప్రారంభించి, అమలు చేశారు. ఈ వాహనాల ద్వారా అనేక మంది యువకులకు ఉపాధి కల్పించారు. ఇంటి ముంగిటకే రేషన్ సరుకులు అందించడంతో ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో తలపై మూట పెట్టుకుని కాలినడకన నడిచే బాధలు తప్పాయి. అయితే కూటమి ప్రభుత్వం మంగళవారం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రారంభమైన ఇంటింటికీ రేషన్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. రేషన్ పంపిణీ వాహనాలకు స్వస్తి పలుకుతూ, మళ్లీ పాత పద్ధతిలోనే రేషన్ షాపుల్లో ప్రజల రేషన్ బియ్యం తీసుకెళ్లే విధంగా కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. జూన్ 1వ తేదీ నుంచి పాత పద్ధతే అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఇంటింటికీ రేషన్ పంపిణీ నిలిచిపోనుంది.

రేషన్ డిపోల్లోనే పంపిణీ

కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ఇంటింటికీ రేషన్ కార్యక్రమం నిలిచిపోనుంది. పాత పద్ధతిలోనే కొత్త ప్రభుత్వం రేషన్ డిపోల వద్ద సరుకులు పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో గిరిజన మండలాలైన బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో 84 రేషన్ డిపోలు తెరుచుకోనున్నాయని అధికారులు చెబుతున్నారు. వీటిలో 24 గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో డిపోలు ఉండగా 60 డిపోలు పౌర సరఫరాల శాఖ ద్వారా నిర్వహించే డిపోలు ఉన్నాయని తెలిపారు.

గిరిజనులకు మళ్లీ కష్టాలు

ఇంటింటికీ రేషన్ పథకం వల్ల ప్రతి నెలా 10వ తేదీ లోగా రేషన్ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందేది. గడచిన ఐదేళ్లుగా ప్రజలకు ఎటువంటి కష్టం కలుగకుండా వాహనాల్లో ఇంటికి రేషన్ పంపిణీ చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం పాత పద్ధతినే అమలులోకి తీసుకురావడంతో గిరిజనులకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలవ్వబోతున్నాయని ఆదివాసీలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నెత్తిన బియ్యం మూటలు పెట్టుకుని మైళ్ల దూరం కాలినడకన నడిచి వచ్చి క్యూలో నిలబడి రేషన్ బియ్యం, ఇతర వస్తువులు తీసుకోవాల్సిన పరిస్థితి మళ్లీ వస్తుందని వాపోతున్నారు.

బియ్యం కోసం కష్టాలు తప్పవు



రేషన్ బియ్యం కోసం గిరిజనలు కలి నడకన నడుచుకుంటూ కష్టాలు పడతారు. ఇంటింటికీ రేషన్ విధానం రద్దు వల్ల ప్రజలు అవస్థలు పడతారు. కూలి పనులు మానుకుని క్యూలో ఉండి రేషన్ తీసుకోవాల్సి వస్తుంది. ఇంటింటికీ రేషన్ అందించడం వల్ల ఇటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. వాహనాల ద్వారానే రేషన్ బియ్యం అందించాలి.

– కారం రాఘవ, న్యూడెమోక్రసీ నాయకులు, అలివేరు, బుట్టాయగూడెం మండలం

రోడ్డున పడనున్న ఎండీయూ ఆపరేటర్లు



కూటమి ప్రభుత్వం సంక్షేమాన్నే కాదు ప్రజలకు ఇవాల్సిన సేవలు కూడా వదిలేస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. సేవలు అందుకోవడం ప్రజల హక్కు అని భావించి సామాన్యుడి ఇంటి వద్దకే అనేక సేవలను అందించింది. అయితే కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను పూర్తిగా మంగళం పలకడంతోపాటు ఇప్పుడు వాహన సేవలను కూడా నిలిపివేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పవు. ఎండీయూ వాహనాలు రద్దు చేయడం వల్ల పోలవరం నియోజకవర్గంలోని 70 కుటుంబాలు వీధిన పడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదు.

– తెల్లం రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయ కర్త, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


మైసన్నగూడెంలో ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని మైసన్నగూడెం గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఈమని శశి కుమార్ నేతృత్వంలో నేత్రపర్వంగా నిర్వహించారు. నవభారత్ జీఎం రాజగోపాల్, జెడ్పీటీసీ సభ్యుడు పోలనాటి బాబ్జి, నూకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ బవిరిశెట్టి మురళీ కృష్ణ, విజయ దుర్గ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు.

నూకాలమ్మ సేవలో వెలమ కార్పొరేషన్ చైర్మన్


పీవీజీ కుమార్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మవారిని ఏపీ వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, సత్యవతి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వీరికి తొలుత ఆలయ శాశ్వత చైర్మన్ రాజాన సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షులు రొంగల నాగేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి అమ్మవారి చిత్ర పటాన్ని, శేష వస్త్రాన్ని ఇచ్చి వేద ఆశీర్వాదాలతో సత్కరించారు.

అయ్యప్పకు అభిషేకాలు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులుతెలిపారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి సన్నిధిలో ప్రతి బుధవారమూ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ తెలిపింది. బుధవారం వీరసరస్వతి, సాల శ్రీనివాస్, వాసా వెంకట కృష్ణారావు పేరున అన్నప్రసాద వితరణ నాగమణి నిర్వహించారని పేర్కొంది. సుమారు 1300 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు తెలిపింది.

సర్వేలు సక్రమంగా పూర్తి చేయాలి


ప్రగడపల్లి సచివాలయంలో సర్వే రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసబాబు

పోలవరం రూరల్: మండలంలో సచివాలయంలో పనిచేసే సిబ్బందికి అప్పగించిన సర్వేలు సక్రమంగా పూర్తిచేయాలని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు ఆదేశించారు. ప్రభుత్వం ఆదేశించే సర్వేలపై నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. సర్వే విధానాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ప్రగడపల్లి సచివాలయాన్ని ఈవోపీఆర్డీ రాజేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసబాబులు సందర్శించి సర్వే ప్రగతిని పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు.

ఖైదీల కోసం చర్మ వ్యాధుల వైద్య శిబిరం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కారాగారంలో ఖైదీల ఆరోగ్య సంరక్షణ కోసం హేలాపురి చాలెంజర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చర్మ వ్యాధుల వైద్య శిబిరం జైల్ సూపరింటెండెంట్ సీహెచ్ఆర్వీ స్వామి సహకారంతో బుధవారం ఏర్పాటుచేశారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణుడు డి.సుబ్బారావు నేతృత్వంలో సుమారు 100 మంది ఖైదీలు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ శుభ్రత పాటించాలని, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాన్ అఫిషియల్ విజిటర్స్ సీనియర్ అడ్వకేట్ కూన కృష్ణారావు, లయన్స్ జిల్లా నాయకులు ఎల్ వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు పోలేశ్వరరావు, జైలర్లు కె.వెంకటరెడ్డి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం అభివృద్ధికి కారణమైన దివంగత కొల్లూరి విశ్వేశ్వరరావు విగ్రహాన్ని గురువారం సాయంత్రం 5 గంటలకు పరిపూడి పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్లు సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి తెలిపారు. విశ్వేశ్వరయ్య దాతృత్వంతో ఇరవైకి పైగా ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పడ్డాయని, వెయ్యి మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలు సమకూరాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులను, అధికారులు, గ్రామస్తులు పాల్గొంటారని తెలిపారు.

పోలవరం ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం: కూటమి పార్టీల ఎన్నికల హామీల్లో భాగంగా పోలవరం ఆదివాసీ జిల్లా ఏర్పాటుచేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ టి.సుధాకర్ కోరారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలను కలుపుకుని పోలవరం, రంపచోడవరం, చింతూరు, కేఆర్‌పురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీ గిరిజన ప్రజలు జీవిస్తున్న ప్రాంతంలో ఆదివాసీ చట్టాలు, గిరిజన హక్కుల పరిరక్షణ, గిరిజన ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడాలంటే ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతమంతా ప్రత్యేక పరిపాలనా విభాగంలోకి రావాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన భూమి ఆక్రమణలు తొలగించాలి


డంపింగ్ యార్డ్‌ను చూపుతున్న నాయకులు

టి.నరసాపురం: మక్కినవారిగూడెం శ్మశాన భూమి ఆక్రమణలను తొలగించాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. దీనిపై గత నెల 21న పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేదని పేర్కొన్నారు. గ్రామంలోని 1.95 ఎకరాల శ్మశానం భూమి ఉందని, ఇందులో పంచాయతీ సర్పంచ్ ఎం గోపాలరావు కార్యదర్శి కలిసి ఎకరం ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని ఆరోపించారు. శ్మశాన స్థలంలో అధికారులు జోక్యం చేసుకుని ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఆనందరావు డిమాండ్ చేశారు. దీనిపై సర్పంచ్ గోపాలరావును వివరణ కోరగా గత పంచాయతీ హయాంలోనే డంపింగ్ యార్డ్‌కు 50 సెంట్లు కేటాయిస్తూ తీర్మానించారని తెలిపారు. ఇప్పటి వరకు ఆ భూమిని శ్మశానానికి వినియోగించలేదన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆనందరావుతోపాటు ఎం ముత్తయ్య, దిరిసినపు విజయ్ తదితరులు ఉన్నారు.

25న గురుకులంలో స్క్రీనింగ్ పరీక్ష

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో ఈనెల 25న రెండో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి తెలిపారు. ఆరోజు ఉదయం 9.30 గంటలకు నిర్వహించే పరీక్షలో అర్హులైన విద్యార్థులు పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: మనస్థాపంలో పురుగుమందు సేవించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు హెచ్‌సీ ఎస్ ఉమామహేశ్వరరావు తెలిపారు. వేగవరానికి చెందిన బోయిన నాని మద్యం అలవాటు వల్ల ఆయన భార్య పదేళ్ల క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. నాటి నుంచి నాని తన తల్లి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 20న మద్యం సేవించి వచ్చి ఇంట్లో పడుకున్నాడు. నాని వాంతులు చేసుకోవడంతో పురుగుమందు వాసన రావడంతో ఆయన్ని తల్లి సుభద్రమ్మ చుట్టుపక్కల వారి సహాయంతో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లింది. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాని బుధవారం ఉదయం మృతిచెందాడు. తల్లి, ఆసుపత్రి నుంచి సమాచారంతో కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు. నాని ఒంటరిగా జీవించలేక విరక్తితో పురుగుమందు సేవించినట్టు పేర్కొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం


బుట్టాయగూడెంలో యోగా చేస్తున్న అధికారులు


చింతలపూడిలో యోగాలో శిక్షణ ఇస్తున్న గురువు

బుట్టాయగూడెం: నిత్యం యోగా చేయడం ద్వారా ఒత్తిడి దూరమై మానసిక స్థితి మెరుగుపడుతుందని ఎంపీడీఓ కె.జ్యోతి అన్నారు. ప్రపంచ యోగా డే సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, వెలుగు, విద్యాశాఖ, మండల పరిషత్ అధికారులు యోగా చేశారు. తహసీల్దార్ పీవీ చలపతిరావు, ఎంఈఓ-2 నరేంద్రరాయ్, ఏఓ టి.బేబీ సరోజిని, సీనియర్ అసిస్టెంట్ ఆది సత్యనారాయణ, వెలుగు ఏపీఎం పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సి, వెంకటలక్ష్మి, ఎస్వీ సత్యవతి, వెలుగు సీసీలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చింతలపూడి : ప్రతి రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు జె.సూరారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షేక్ షకీలున్నీసా, డిప్యూటీ ఎంపీడీఓ జె.రత్నకుమార్, మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

యోగా మాసోత్సవం ప్రారంభం

కొయ్యలగూడెం: అంతర్జాతీయ యోగా మాసోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.కిరణ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. అధికారులతో పాటు ఆయన ఆసనాలను వేశారు. పొంగుటూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు.

శ్రీనివాసపురంలో..

జంగారెడ్డిగూడెం: మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఉత్తమ సాధనం అని ఉపసర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అన్నారు. శ్రీనివాసపురం రైతు సేవా కేంద్రంలో యోగ ఆంధ్ర 2025 క్యాంపైన్‌లో భాగంగా కర్టెన్‌రైజర్ కార్యక్రమం నిర్వహించారు. వార్డు సభ్యులు, ప్రజలు, అధికారులు యోగాసనాలు వేశారు. కార్యక్రమలో ఎంపీటీసీ సభ్యుడు జుజ్జవరపు తాతారావు, సచివాలయం స్టాఫ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోలవరంలో..

పోలవరం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యాలయంలో యోగాపై అవగాహన కల్పించారు. నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రికార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం


ప్రగడవరం వర్మి కంపోస్ట్ ప్రాసెస్ యూనిట్‌ను పరిశీలిస్తున్న అనురాధ

చింతలపూడి : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పంచాయితీ అధికారిణి కె.అనురాధ సూచించారు. ప్రగడవరం సచివాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. గ్రామంలో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని అన్నారు. గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును ఆమె పరిశీలించారు. వర్మి కంపోస్ట్ ప్రాసెస్ యూనిట్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో రోడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వచ్చేది వర్షా కాలమని దోమలు పెరగకుండా, మురుగు నీరు నిల్వ ఉండకుండ చర్యలు తీసుకోవాలని అన్నారు. చెత్త నుంచి సంపదను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.భూపతి, డిప్యూటీ ఎంపీడీఓ కె.రత్నకుమార్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి


పూచికగొందిలో మాట్లాడుతున్న పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాభియాన్ (పీఎం జన్మాన్ యోజన) పథకాన్ని అమలు చేస్తోందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ అన్నారు. బుట్టాయగూడెం మండలంలోని మారుమూల గ్రామాలైన రెడ్డిబొడ్డేరు, గొట్టాలరేవు, రేపల్లె, రేగులపాడు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. పీఎం జన్మాన్ పథకంలో మంజూరైన బహుళ ప్రయోజన కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ ఈ భవనాలను రూ.60 లక్షలతో గిరిజనుల ప్రయోజనం కోసం నిర్మిస్తున్నట్టు చెప్పారు. పీఎం జన్మాన్ పథకంలోనే మంజూరైన గురుగుమిల్లి, పూచికగొంది రోడ్డు పనులను కూడా ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రెడ్డిబొడ్డేరు, గొట్టాలరేవు ప్రజలతో మాట్లాడారు. ఇళ్లు, రోడ్ల నిర్మాణం, నీటి సౌకర్యం, గృహాలకు విద్యుత్ సౌకర్యం, పలు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు నాయక్ తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ డీఈ ఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

చింతలపూడి : నియోజకవర్గంలో ప్రతి మండలంలో ఒక పంచాయతీని తీసుకోని మూడు నెలల్లో ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ఆదేశించారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో డీపీఓ కె.అనురాధ అధ్యక్షతన బుధవారం నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్లక్ష్యం వదిలి, ప్రజలకు జవాబు దారితానంగా ఉండాలని సూచించారు. 14, 15వ ఆర్థిక సంవత్సరం నిధులు, వివరాలు, జమా ఖర్చులు, పన్నులు వివరాలు అందజేయాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో నూజివీడు, జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారులు, నియోజకవర్గంలో ఉన్న డిప్యూటీ ఎంపన్నోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు క్షేత్రంలో హనుమజ్జయంతి వేడుకలు


ద్వారకాతిరుమలలో విద్యుద్దీప కాంతులీనుతున్న ఆంజనేయుని ఆలయం


ముస్తాబైన హనుమాన్ ఆలయం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఉపాలయమైన క్షేత్రంలోని ఆంజనేయస్వామివారి ఆలయం హనుమజ్జయంతి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. సిబ్బంది ఆలయాన్ని విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రాంతంలో షామియానా పందిళ్లు నిర్మించి, ఆలయాన్ని సుగంధ భరిత పుష్ప మాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో తీర్చిదిద్దారు. బుధవారం రాత్రి వరకు ఈ పనులు కొనసాగాయి. ఆలయంలో గురువారం ఉదయం హనుమద్ జయంతిని పురస్కరించుకుని స్వామివారికి విశేష పూజలు చేయనున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు.

నేడు లక్ష తమలపాకుల పూజ

జంగారెడ్డిగూడెం: శ్రీ మద్ది ఆంజనేయస్వామివారి సన్నిధిలో శిలామయ ఉష్ణ సహిత బలిపీఠాల ప్రతిష్ఠాపన క్రతువు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. గురువారం హనుమద్ జయంతి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ చేయనున్నట్టు ఈఓ ఆర్వీ చందన తెలిపారు.

హనుమ ఆలయాల ముస్తాబు

కొయ్యలగూడెం: అంజనీ సుతుడు హనుమాన్ జన్మదిన వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. గురువారం కొయ్యలగూడెం, ఆరిపాటి, సరిపల్లి, బయ్యన్నగూడెం, అచ్యుతాపురంలలో జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు. కన్నాపురంలోని పులిరా మన్నగూడెం రోడ్డులో ఉన్న ఆలయం వద్ద సువర్చలా సమేత హనుమద్ కల్యాణం నిర్వహిస్తున్నట్టు ధర్మకర్త గడి గోవిందు తెలిపారు. ఆలయాల వద్ద మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

సీలింగ్ భూములను పేదలకు పంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

జంగారెడ్డిగూడెం: పంగిడిగూడెం ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం గ్రామంలోని సీపీఎం మండల కార్యదర్శి ఎం జీవరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన భూ పోరాట కమిటీ సమావేశంలో రవి మాట్లాడారు. గ్రామంలో 200 ఎకరాలకు పైగా ల్యాండ్ సీలింగ్ భూములు ఉన్నట్టు చెప్పారు. కొన్ని సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని భూమిలేని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. సదరు భూముల్లో సాగులో ఉన్న వారిపై అక్రమకేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు చెందాలని చట్టం చెబుతున్నటప్పటికీ అధికారులు కుమ్మక్కై భూస్వాములకు కట్టబెడుతున్నారని తెలిపారు. భూములు ఆక్రమించుకొని సాగు చేస్తున్న భూస్వాములపై కేసులు నమోదు చేసి, పేదలు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, మిగిలిన ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, జి.సూర్యకిరణ్, గ్రామ భూ పోరాట నాయకులు ఎం బాలరాజు, ఎం ఆశోక్ కుమార్, కె.ఏసు, కె.సుబ్బారావు, ఎం.కుమారి, డి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ అమ్మకాల పెంపునకు కృషి


జీసీసీ కార్యాలయంలో సేల్స్‌మెన్స్‌తో మాట్లాడుతున్న డీఎం పార్వతీశ్వరరావు

బుట్టాయగూడెం: గిరిజన ఉత్పత్తుల అమ్మకాలను పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు తెలిపారు. బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం జీసీసీ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మళ్లీ చౌకడిపోల వ్యవస్థను తీసుకొస్తున్న నేపథ్యంలో గిరిజన సహకార సంఘం ద్వారా నిర్వహిస్తున్న డిపోల సేల్స్‌మెన్స్‌తో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉన్న డిపోల్లో అన్ని రకాల జీసీసీ ఉత్పత్తులను అందుబాటులో ఉంచి ప్రజలకు అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా బుట్టాయగూడెంలో జీసీసీ ద్వారా కారం ప్యాకింగ్ యూనిట్ ఏర్పాటుచేశామని తెలిపారు. నాణ్యమైన కారం ప్యాకెట్లలను తయారుచేసి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. రాబోయే రోజుల్లో మిరపకాయలు నిల్వ చేసుకునేందుకు గోడౌన్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో ఉన్న అడ్డతీగల, మారేడుమిల్లి, రాజవమ్మంగి, రంపచోడవరం, కేఆర్‌పురం అన్ని డివిజన్‌లలో జీసీసీ ఉత్పత్తులు, అమ్మకాలను వేగవంతం చేస్తామని చెప్పారు. గతేడా అన్ని రకాల వస్తువుల అమ్మకాల్లో రూ.75 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా అమ్మకాల్లో రూ.57 కోట్ల వరకు టార్గెట్ పూర్తి చేశామని వివరించారు. బుట్టాయగూడెం జీసీసీకి సంబంధించి గత ఏడాది లక్ష్యం రూ.27 కోట్లు పెట్టుకోగా దీనిలో రూ.25.50 కోట్లు టార్గెట్‌ను పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో జీసీసీ సీనియర్ మేనేజర్ చెరుకూరి రాజయోగి, సిబ్బంది, సేల్స్‌మెన్‌లు, తదితరులు పాల్గొన్నారు.